క్లుప్తంగా

ఉచిత వైద్యశిబిరం



ఊట్కూరు: మండలంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం గీతా ఆస్పత్రి నారాయణపేట వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచితవైద్య శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరాన్ని మాజీ సర్పంచ్ సూర్యప్రకాశ్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ మణెమ్మ, డాక్టర్ గీత కలిసి ప్రారంభించారు. ఈ శిబిరంలో శస్త్ర చికిత్స వైద్యనిపుణులు డాక్టర్ విశ్వనాథ్, స్త్రీవైద్య నిపుణురాలు డాక్టర్ గీత సుమారు 300మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ భరత్‌రెడ్డి, నాయకులు గోపాల్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, ఎంపీటీసీ హన్మంతు, రవికుమార్, రఘు పాల్గొన్నారు.

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

కృష్ణా: మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం ఉదయం కల్యాణ లక్ష్మి, షాదిముబారక్ చెక్కులను ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి చేతుల మీదుగా పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ దయాకర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో మొత్తం 121మంది లబ్ధిదారులు ఉన్నారని, వారు సకాలంలో హాజరై తమ చెక్కులను పొందాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమానికి మండల ప్రజాప్రతినిధులు ఉదయం 9గంటలకు హాజరుకావాలని కోరారు.

మాగనూర్: కల్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కుల పంపిణీ చేయనున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు కల్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం ఉంటుందని, చెక్కుల పంపిణీకి ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి హాజరవుతారని తెలిపారు. లబ్ధిదారులు, అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

దామరగిద్ద: మండలంలోని వివిధ గ్రామాల లబ్ధిదారులకు సోమవారం స్థానిక రైతు వేదికలో కల్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే పర్ణికారెడ్డి హాజరవుతున్నట్లు తహసీల్దార్ శివజ్యోతి తెలిపారు. ఆయా గ్రామాల లబ్ధిదారులు విధిగా హాజరై చెక్కులు పొందేలా చూడాలని పంచాయతీ కార్యదర్శులు ఆదేశించారు.

ముగిసిన లక్ష్మీనరసింహా స్వామి ఉత్సవాలు



మరికల్: మండలంలోని ఎక్లాస్‌పూర్ లక్ష్మీనరసింహాస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం నాటితో ముగిశాయి. వారం రోజులపాటు జరిగిన ఉత్సవాల్లో భాగంగా చివరి రోజున భక్తులు ఆలయ ఆవరణలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

ఎక్లాస్‌పూర్‌లో బోర్ డ్రిల్లింగ్



నారాయణపేట: భక్తుల దాహార్తిని తీర్చేందుకు మండలంలోని ఎక్లాస్‌పూర్‌లో తిమ్మప్ప ఆలయం వద్ద బోర్ డ్రిల్లింగ్ వేయించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సదాశివారెడ్డి, కాంగ్రెస్ కార్యకర్తలు భాస్కర్‌రెడ్డి, ఊషప్ప, లక్ష్మణ్, అశోక్, బాలకిషన్‌గౌడ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, వంశీచంద్‌రెడ్డికి సన్మానం

మక్తల్: మండలంలోని సంగంబండలో ఆదివారం ముంపు బాధితుల సమస్యలను తెలుసుకునేందుకు గ్రామానికి వచ్చిన సందర్భంగా సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు వంశీచందర్ రెడ్డి, ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని బాధితులు శాలువాతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో వారు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ వనజమ్మ, బీకేఆర్‌ఫౌండేషన్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు గోపాల్‌రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ రవికుమార్‌యాదవ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గణేష్‌కుమార్, రవికుమార్, సిద్ధార్థరెడ్డి పాల్గొన్నారు.



తిమ్మప్పఆలయంలో ఎమ్మెల్యే పూజలు



ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

నారాయణపేట: మండలంలోని ఎక్లాస్‌పూర్‌లో తిమ్మప్పస్వామి జాతర ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు ఆలయ ధర్మకర్త మాణిక్‌శాస్త్రీ పూర్ణకుంభంతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. అనంతరం వేద పండితుల ఆశీర్వచనలతోపాటు పూలమాల, శాలువాతో ఎమ్మెల్యేను సత్కరించి ప్రసాదాలను అందజేశారు. అదేవిధంగా కీ.శే. మోహన్‌లాల్ లాహోటి జ్ఞాపకార్థంతో జాతరకు వచ్చే భక్తులకు దాహార్తిని తీర్చేందుకు తాగునీటి కేంద్రాన్ని ప్రారంభించి నిర్వాహకులను అభినందించారు. లయన్స్‌క్లబ్ గవర్నర్ హరి నారాయణభట్టడ్, జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు మనోహర్ ప్రసాద్‌గౌడ్, పుర కౌన్సిలర్ ఎండీ సలీ, శ్రీనివాస్ లాహోటి, విజయ్‌కుమార్, ఎంపీటీసీ రాంరెడ్డి, మాజీ ఎంపీపీ సదాశివారెడ్డి పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



కోస్గిలో సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న నాయకులు



నాగిరెడ్డిపల్లిలో సీసీ రోడ్లను ప్రారంభిస్తున్న నాయకులు

నారాయణపేట: మండలంలోని కోటకొండలో ఎన్ఆర్ఈజీఎస్ నిధుల కింద రూ. 10 లక్షల వ్యయంతో వివిధ కాలనీలో సీసీరోడ్డు పనులను ఆదివారం పలువురు ప్రతిపక్ష నాయకులు ప్రారంభించి మాట్లాడారు.. గ్రామాభివృద్ధికి అందరు కలిసికట్టుగా కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు ఎడ్ల రాజు, సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా నాయకులు యాదగిరి, బీజేపీ, ఓబీసీ రాష్ట్ర నాయకులు శ్రీనివాస్, ఎంకట్రాములుగౌడ్ పాల్గొన్నారు.

కోస్గి: మండల పరిధిలోని చెన్నారంలో రూ. 30లక్షల నిధులతో చేపట్టిన సీసీరోడ్ల నిర్మాణ పనులను ఆదివారం గ్రామ మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రారంభించారు. సీఎం రేవంత్ ప్రత్యేక చొరవతో చేపట్టిన రోడ్డు పనులను నాణ్యతగా త్వరితగతిన పూర్తి చేయాలని నాయకులు సంబంధిత కాంట్రాక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ మమతమల్లేష్, కాంగ్రెస్ నాయకులు వెంకట్‌రెడ్డి, విశ్వనాథం, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఊట్కూరు: మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లిలో ఆదివారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విఘ్నేశ్వర్‌రెడ్డి సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. రూ. 5 లక్షల నిధులతో రోడ్లను వేస్తున్నట్లు తెలిపారు. మధు, ఎస్ రవికుమార్, మల్లేష్, జాకీర్ పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న నాయకులు ఎం. కృష్ణ

నారాయణపేట: వచ్చేనెల 3, 4, 5 తేదీల్లో ఖమ్మంలో నిర్వహించే సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ యూనిటీ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని రాష్ట్ర నాయకులు ఎం.కృష్ణ, జిల్లా కార్యదర్శి బి.రాము పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని భగత్‌సింగ్ భవన్‌లోని నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లారు... ఖమ్మంలో జరిగే సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా, పీసీసీ సీపీఐ(ఎంఎల్), సీపీఐ (ఎంఎల్) ఆర్‌ఐ పార్టీలు ఐక్యమై సీపీఐ (ఎంఎల్)మాస్‌లైన్ అనే ఒక కొత్త పార్టీగా ఆవిర్భవించిందన్నారు. దేశంలో మతోన్మాదాన్ని పెంచి పోషిస్తున్న బీజేపీ, ఆర్ఎస్ఎస్ విధానాలను వ్యతిరేకించాలని, మనుషులంతా స్వేచ్ఛ సమానత్వంతో జీవించాలన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు సలీం, కాశీనాథ్, కిరణ్, విజయలక్ష్మి, కాలేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

వీరశైవలింగాయత్ మండల కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులు

నర్వ: వీరశైవ లింగాయత్ మండల నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండల గౌరవ అధ్యక్షుడిగా సురేందర్, అధ్యక్షుడిగా విజయ్‌కుమార్ (లంకాల్), ప్రధాన కార్యదర్శిగా చంద్రశేఖర్, కో- శాధికారిగా శివ శంకర్, ఉపాధ్యక్షుడిగా విజయ్‌కుమార్‌లను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికకు సంఘం జిల్లా ఇన్‌చార్జి కొండ వీరన్న, మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు శివకుమార్, పేట జిల్లా గౌరవ అధ్యక్షుడు మల్లికార్జున్, అధ్యక్షుడు రవికుమార్, ఇతర నాయకులు శివకుమార్, బసంత్‌రాజ్, నాగభూషణం, శంకర్‌బాబు, రవికుమార్, చరణ్‌కుమార్ పాల్గొన్నారు.

గ్రామ యువకుడికి సన్మానం



మహేష్‌ను సన్మానిస్తున్నా గ్రామస్తులు

కృష్ణా: మండలంలోని తంగిడి గ్రామానికి చెందిన మడివాళ మహేష్ అనే యువకుడు పాదయాత్రగా ఆయోధ్యకు వెళ్లి శ్రీరాముడిని దర్శించుకున్న ఆయనను గ్రామస్తులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ మేరకు.. గ్రామస్తులు మాట్లాడుతూ.. గత నెల 21న తంగిడి నుంచి బయలు దేరిన వ్యక్తి సరిగ్గా నెల రోజులోనే అయోధ్యకు చేరుకొని శ్రీరాముడిని దర్శించుకోవడం గర్వంగా ఉందన్నారు. అంతకుముందు గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామ యువకులు, పెద్దలు సన్మానించారు. కార్యక్రమంలో ప్రముఖులు హన్మంత్‌రాయగౌడ్, సురేష్, అమీన్‌రెడ్డి, నర్సిరెడ్డి, బస్వరాజ్ స్వామి, మాజీ సర్పంచ్‌లు మారెప్ప, హన్మంత్‌రాయ తదితరులు పాల్గొన్నారు.

రైతు వ్యతిరేక విధానాలపై పోరాటం



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

అమరచింత: వ్యతిరేక విదానాలపై కేంద్రం అవలంభిస్తున్న తీరుపై ఉద్యమించాల్సిన అవసరం ఉందని ఏఐపీకేఎస్ జిల్లా అధ్యక్షుడు రాజన్న, హనుమంతు అన్నారు. ఢిల్లీలో రైతుపై జరిగిన కాల్పులపై పట్టణంలోని అంబేద్కర్‌విగ్రహం వద్ద ఆదివారం నిరసన చేపట్టారు. రాజధానిలో రైతులు తమ హక్కుల కోసం పోరాడుతున్నారని తెలిపారు. శాంతియుతంగా తమ నిరసన కార్యక్రమాలను నిర్వహించుకుంటున్న రైతులపై కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం పోలీసులతో దాడులు చేయించడం, డ్రోన్‌ల ద్వారా ఫైరింగ్ చేయిస్తుందన్నారు. స్వామినాథన్ కమిషన్ సూచించిన విధంగా రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, రైతులపై అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు, పోలీసు దాడులలో మరణించిన రైతు కుటుంబాలకు పరిహారం అందించి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో సామేలు, చింతలన్న, మసలమని, భక్తరాజ్‌పాల్గొన్నారు.

సోఫియాన్ క్షేమంగా ఇంటికి వస్తారు

బాధిత కుటుంబానికి భరోసానిచ్చిన ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

పొట్టకూటి కోసం వెళ్లి రష్యాలో చిక్కుకున్న జిల్లా కేంద్రానికి చెందిన మహ్మద్‌సోఫియాన్ ఇంటికి క్షేమంగా తిరిగి వచ్చేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ద్వారా కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే పర్ణికారెడ్డి తెలిపారు. ఆదివారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని హాజీఖాన్ పేటలోని మహ్మద్ సోఫియాన్ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించి మాట్లాడారు. ఆయన ఇంటికి క్షేమంగా చేరుకునేంత వరకు అన్ని విధాలుగా అండగా ఉంటామని ఆ కుటుంబానికి భరోసానిచ్చారు. ఎమ్మెల్యే వెంట సలీం, సరిత, మహిమూద్, యూసుఫ్‌తాజ్, అజీమ్ శివారెడ్డి తదితరులు ఉన్నారు.

సైన్స్ సంబరాలు నిర్వహించాలి

నారాయణపేట: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 28న జిల్లాలోని అన్ని పాఠశాలల్లో సైన్స్ సంబరాలు నిర్వహించాలని డీఈఓ అబ్దుల్ ఘనీ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, టీఎస్ఎంఎస్, కేజీబీవీ, అండ్ యూఆర్ఎస్ స్పెషల్ ఆఫీసర్లకు సూచించారు. సైన్స్ ప్రయోగాలు, సెమినార్లు నిర్వహణ, ఒక శాస్త్రజ్ఞుని చరిత్ర, పరిశోధనలు, వాటి ప్రభావాల పై మాట్లాడించడం, పోస్టర్ తయారీ పోటీలు, టీఎల్ఎం తయారీ ప్రదర్శన, పాఠశాల ప్రయోగశాలలో ఉన్న సైన్స్ సామాగ్రి ప్రదర్శించడం, సైన్స్ మేళాలలో ప్రదర్శించాలన్నారు. జిల్లాలోని సీవీ రామన్ సైన్స్ ఫోరం ఈ కార్యక్రమాన్ని కో ఆర్డినేషన్‌చేసుకోవాలని తెలిపారు. వివరాలకు నంబర్ 9440167947కు సంప్రదించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మద్దూరు: కొత్తపల్లి మండల పరిధిలోని వీరారంలో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు మధ్యాహ్నం 3గంటల నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ బానోదయ తెలిపారు. సబ్‌స్టేషన్‌లోని యార్డులో పని ఉండడంతో ఈ విద్యుత్ అంతరాయం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

జిల్లా కబడ్డీ సీనియర్స్ జట్టు ఎంపిక



మరికల్: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం జిల్లా సీనియర్ కబడ్డీ జట్టును ఎంపిక చేశారు. ఇందుకు గాను 40మంది క్రీడాకారులు పాల్గొనగా అందులో నుంచి ప్రతిభ కనబర్చిన 12మంది లేయర్లను ఎంపిక చేసినట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతిరెడ్డి తెలిపారు. మార్చి 2నుంచి 4 వరకు నల్గొండ జిల్లా నాగార్జున్ సాగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి సీనియర్ చాంపియన్‌షిప్‌లో జిల్లా కబడ్డీ జట్టు పాల్గొంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బాల్‌రాజ్, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

బ్రౌంజ్ మెడల్ సాధించిన క్రీడకారుడు రవి



నారాయణపేట: గౌడియం స్పోర్టోపియా స్టేడియంలో నిర్వహించిన తెలంగాణ స్టేట్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ 2024పోటీలో పేట జిల్లా క్రీడాకారుడికి 400 మీటర్స్ పురుషుల భాగంగా టి.రవికుమార్ బ్రౌంజ్ మెడల్ సాధించారు. ఈ మెడల్‌ను ద్రోణాచారి అవార్డు గ్రహీత నాగపూర్ రమేష్ చేతుల మీదుగా అందుకున్నారు. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రటరీ రమణ ఆ విద్యార్థిని అభినందించారు.

నేడు సినీనటుడు తనికెళ్ల భరణి రాక

దామరగిద్ద: మండలంలోని కాన్‌కుర్తి ఈశ్వర ఆలయంలో నిర్వహించనున్న శివపార్వతుల కల్యాణ మహోత్సవానికి సినీనటుడు శివభక్తుడు తనికెల్ల భరణి హాజరవుతున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం 12గంటలకు ఆలయంలో వీరశైవ ఆగమోక్త శివ శ్రీకాంత్‌స్వామి, మహేశ్వరులచే నిర్వహించనున్న ఉత్సవాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు.

బీజేపీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడి ఎన్నిక

ధన్వాడ: బీజేపీ పార్టీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడిగా మండలానికి చెందిన పాండునాయక్ ఎన్నికయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు కల్యాణ్ నాయక్ నియామక పత్రాన్ని అందజేశారు. ఎంపికపై జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, రాష్ట్ర అధ్యక్షులకు కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్ర స్థాయిలో పేట విద్యార్థి ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న డీఈఓ

నారాయణపేట: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ రాష్ట్రస్థాయి పోటీలో విద్యార్థి సత్తా చాటారు. జిల్లాలోని మరికల్ మండలం తిలేర్ ఎంపీ యూపీఎస్ పాఠశాల విద్యార్థిని బుజ్జమ్మ పాటల పోటీలో ప్రతిభకనబరిచి రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతిని సాధించింది. 33జిల్లాల నుంచి 396 నామినేషన్లలో పేట విద్యార్థి ప్రథమ స్థానాన్ని దక్కించుకొని జిల్లాకు పేరు తెచ్చినందుకు డీఈఓ అబ్దుల్ ఘనీ ఆ విద్యార్థిని అభినందించారు. ఈ నెల 28న వరంగల్ ప్రాంతీయవైజ్ఞానిక కేంద్రంలో అతిథుల నుంచి ప్రశంసాపత్రాన్ని అందుకోనున్నారు. ఈ సందర్భంగా డీఈఓతో పాటు జిల్లా సైన్స్ అధికారి భానుప్రకాష్, జిల్లా మానిటరింగ్ అధికారి విద్యాసాగర్, జిల్లా సెక్టోరల్ అధికారి శ్రీనివాస్ అభినందించారు.

పుడమి సంరక్షణపై విద్యార్థులకు శిక్షణ



ప్రతిభ చూపిన ముశ్రీఫా పాఠశాల విద్యార్థులు

కోస్గి: పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులను భాగస్వాములను చేయడంలో భాగంగా పాఠశాల విద్యాశాఖ, హరిత విప్లవ మండలి (సీజీఆర్) సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణలో పాఠశాలకు చెందిన విద్యార్థులు సైతం పాల్గొన్నారని ముశ్రీఫా జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం బాలకృష్ణ తెలిపారు. రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం అన్మాస్‌పల్లిలోని ఎర్త్ సెంటర్‌లో మూడు రోజులపాటు కొనసాగిన లీడ్ ఎర్త్ లీడర్స్ శిక్షణా తరగతులు ఆదివారం ముగిశాయని సైన్స్ ఉపాధ్యాయుడు మల్లేశం తెలిపారు. ఈ శిక్షణలో విద్యార్థులు శిరీష, రిషిక, శివకుమార్, స్వర్ణ కల్పన, జగదీశ్, స్వప్న పాల్గొని ప్రతిభ చూపి ప్రశంసలు అందుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ శిక్షణలో పోషకాహారం, ప్రకృతి నడక, జీవ వైవిధ్యం, నేల ఆరోగ్యం, బయో ఎంజైమ్‌లు, మొక్కలు నాటే పద్ధతులతోపాటు పలు అంశాలపై శాస్త్రవేత్తలు, నిపుణులు శిక్షణలో అవగాహన కల్పించారన్నారు.

కవి రామ్మోహన్‌రావుకు సాహితీ సేవా పురస్కారం



పురస్కారం అందుకుంటున్న రామ్మోహన్‌రావు

నారాయణపేట: తెలుగు సాహిత్యంలో అందించిన సేవలకు గుర్తింపుగా జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ కవి రామ్మోహన్‌రావును హైదరాబాద్‌లోని మల్కాజిగిరి వీఆర్ ఫంక్షన్‌హాల్‌లో అక్షర కౌముది సాహిత్య సంస్కృతిక సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆ సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తులసి వెంకటరమణ చార్యులు, మూర్తి శ్రీదేవి ఆయనకు సాహితి సేవా పురస్కారాన్ని అందజేసి శాలువాతో సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ కవి రామ్మోహన్‌రావు మారుముల ప్రాంతంలో ఉంటూ తెలుగు బాషకు జీవం పోస్తున్నారని ఇలాంటి సాహితి వేత్తలను సత్కరించడం గర్వకారణమన్నారు. సేవా పురష్కరం అందుకున్న రామ్మోహన్‌రావును ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం అభిమాన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, టీవీ రేడియో గాయకులు సంగ నర్సింహులు, వసంత్‌కుమార్, రామకృష్ణ అభినందించారు.

భక్తిశ్రద్ధలతో మహాపడిపూజ



పూజలు చేస్తున్న శివభక్తులు

మక్తల్: మండలంలోని రామసముద్రంలో ఆదివారం శివస్వాముల మహాపడిపూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల స్థానిక శివాలయాల్లో స్వామివారికి పంచామృతాభిషేకం, మెట్లపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు.. ప్రభు గురుస్వామి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ దైవభక్తిని అలవర్చుకోవాలన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో గురుస్వాములు తదితరులు పాల్గొన్నారు.

ధన్వాడ: మండల కేంద్రంలో శివ మాలధారులు మల్లికార్జున స్వామి మహాపడి పూజను వైభవంగా నిర్వహించారు. స్థానిక శివాలయంలో స్వామివారి మండపాన్ని ఏర్పాటుచేసి పూజలు చేశారు. ఈ సందర్భంగా ప్రభు గురుస్వామి ఆధ్వర్యంలో కళశ పూజ, శివపార్వతుల కల్యాణం, అభిషేకం, మెట్లపూజ నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

కోడి పందేల స్థావరాలపై దాడులు

మక్తల్: కోడి పందేల స్థావరాలపై టాస్క్‌పోర్స్ పోలీసులు దాడులు చేసిన సంఘటన మండలంలోని కాట్రెవ్‌పల్లిలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలిలా.. కాట్రెవ్‌పల్లి శివారులో కొందరు వ్యక్తులు కోడి పందేలు ఆడుతున్న సమాచారం తెలుసుకుని టాస్క్‌పోర్స్ పోలీసులు దాడులు చేయడంతో ఏడుగురిని పట్టుకున్నారు. వారి వద్ద 4 కోడి పుంజులు, 9కోళ్లకు కత్తులు, 7సెల్‌ఫోన్లు, 7బైకులు, రూ. 7700నగదును స్వాధీనం చేసుకున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ లాల్‌సింగ్ తెలిపారు. ఈ సంఘటనపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కరాటే పోటీలో విద్యార్థుల ప్రతిభ



కరాటే పోటీలో పాల్గొన్న విద్యార్థులు

మాగనూర్: కరాటేతో శారీరక ధృఢత్వం లభిస్తుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రతిభ విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో కరాటే పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ.. కరాటే అనేది ఆత్మరక్షణకు ఎంతో అవసరమని, మహిళలు తమకు తాము రక్షించుకోవడానికి తప్పకుండా కరాటే నేర్చుకోవాలన్నారు. అనంతరం కరాటే పోటీలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బెల్టులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజు, నాయకులు ఆంజనేయులు, శ్రీనివాసులు, మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యాయ బృందం, కరాటే మాస్టర్స్ పాల్గొన్నారు.

ఆదమరిస్తే.. ప్రమాదమే



అమరచింత: మండలంలోని పాంరెడ్డిపల్లె శివారులో గల రైతువేదిక వద్ద ఉన్న బోరుమోటర్ ప్రమాదాలకు నెలవుగా మారింది. రైతువేదిక నిర్మాణ సమయంలో తవ్వించిన బోరుబావి ప్రస్తుతం పైకప్పులేకుండా ఉండటంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందో అన్న సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. నోరుతెరుచుకున్న బోరుబావిని మోటర్ బిగించాలని లేదా వాటిని మూసి ఉంచాలని వ్యవసాయ రైతులు కోరుతున్నారు.

ముమ్మరంగా డ్రంకెన్ డ్రైవ్

ఆత్మకూర్: పట్టణంలో ఎస్ఐ నరేందర్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి స్థానిక గాంధీచౌక్, చెరువుకట్ట వద్ద డ్రంకెన్ డ్రైవ్ తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఇద్దరిపై కేసు నమోదు చేశారు. వాహనదారుల హెల్మెట్, ఆర్సీ, లైసెన్సులు పరిశీలించారు. వాహనదారులు ట్రాఫిక్ రూల్స్‌ను తప్పనిసరిగా పాటించాలని, తాగి డ్రైవింగ్ చేయరాదని సూచించారు.

సబ్ కమిటీ ఏర్పాటుపై హర్షం

దామరగిద్ద: ప్రభుత్వం ఉద్యోగుల బదిలీలకు తెచ్చిన 317 జీఓను పున:పరిశీలించి ఉద్యోగులకు ఎదురువుతున్న ఇబ్బందులను తొలగించేందుకు కేబినెట్‌సబ్‌కమిటీని ఏర్పాటు చేయడంపై రాష్ట్ర పోరం వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కిషోర్ కుమార్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఉద్యోగులు జీఓ ద్వారా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే దిశగా సబ్ కమిటీ చర్యలు తీసుకోవాలని కోరారు.